

# నన్ను నమ్మవూ?

శివల జగన్నాథరావు

గడప ముందు కారు వచ్చి ఆగిన శబ్దం విని, చేతిలో అల్లుతున్న లేసుతో అలాగే వీధిద్వారం దగ్గరికి వెళ్ళి చూసింది సీత. కారు తమది కాదు. ఎదిరింటి వారిది. కారు లోంచి ఆ ఇంటాయనా, భార్యా కొడుకూ దిగి ఇంట్లోకి వెళ్ళిపోయేరు సీత ఉస్సు రంటూ లోపలికి వచ్చింది. ఆమెకి క్షణ క్షణానికి ఆత్రుతా విసుగూ ఎక్కువవు తున్నాయి.

'ఛా! ఏమిటి బాబూ ఈయన? వట్టి జిడ్డు మనిషి. నిర్మల రైలు దిగే వుంటుంది సుమా! ఏవో మాటలు పెట్టి దాన్ని అక్కడే ఆపేసి వుంటారు. కాకపోతే, కారు మీద రావడానికి ఇంతసేపా? అసలు తనే స్టేషన్‌కి వెళ్దామనుకుంది. పీకల మీద కత్తిలాగా ఆ డెలివరీ కేసొకటి దాపురించి నిముషాల్లో తెముల్చుకోవల్సిన పని గంటల తరబడి అయింది. ఆయన అడిగేరు కూడాను "వస్తావా నిర్మలని తీసుకువద్దాం" అని. 'హాస్పటల్లో చచ్చి చచ్చి వచ్చేను. వొంట్లో పిసరంత వోపికలేదు మీరే వెళ్ళి తీసుకు రండి దాన్ని" అంది స్నానం అదీ కానిచ్చి నడుం వాల్చి లేచేసరికి ఇంత టయిమయింది. బొత్తిగా ఇంత ఆలశ్యమవుతుందా, రావ డానికి?

సీత లేసుని మంచం మీద పడేసింది. వీధి తలుపులు చేరవేసి వంట గదిలోకి వెళ్ళబోతుంటే గుమ్మంలో పెద్ద శబ్దం చేస్తూ వచ్చి ఆగింది కారు. కారు దిగి సీత భర్త ప్రభాకర్, కూతురు నిర్మల ఇంట్లోకి వచ్చేరు. ప్రభాకర్ పెదాల మీద చిరునవ్వు చూడగానే సీతకి అంచల మీద కోపం వచ్చేసింది.

"చాల్లెండి. నవ్వేరు. మూడు గంట లయింది. చూసి చూసి కళ్ళు నెప్పులు పుడుతున్నాయి తొవలో టైము సరిపో యిందా లేదా కబుర్లకి?" ప్రభాకర్ గట్టిగా నవ్వేడు. "కబుర్లు చెప్పుకుందికి టయిమెక్కడుందే వెర్రిదానా. ఆ రైలు ఎన్నింటికి వచ్చిందో స్టేషన్‌లో ఎంతసేపు పడిగాపులు కాశానో నీ కూతుర్నడుగు" అన్నాడు బట్టలు మార్చుకుంటూ.

భోజనాల దగ్గర తను అడిగిన ఒకటి రెండు మాటలకి జవాబు చెప్పక తలవంచుకు అన్నం తింటున్న కూతుర్ని చూసి సీత తెల్లబోయింది. వేళ్ళతో అన్నం మెతుకుల్ని కెలుకుతుంది,

"ఏమిటే ఆ పరాకూ?" అంది.

నిర్మల ఉలిక్కిపడి తలెత్తి తల్లి వేపు చూసి గబగబా అన్నం ముద్దలు మింగింది. పొలమారి వుక్కిరిబిక్కిరై నీళ్ళు గటగటా తాగి

"ఏమిటమ్మా, అంటున్నావూ?" అంది.

సీత భర్త వేపు చూసింది "చూశారా దీని వాలకం?"

"కారులోనూ అదే వరస రైలు దిగిన దగ్గర్నుంచీ మూతి ముడుచుకునే వుంది" అన్నాడు ప్రభాకర్

"బావుంది" అంతకంటే సీతకేమనాలో తోచలేదు. ఆమె కేదో భయం పుట్టింది నిడదవోలులోనే బి ఏ చదువుతానని పట్టుబట్టిన నిర్మల ఈ రెండేళ్ళలోనూ అక్కడేమీ ఎంకె తగిలించుకోలేదు కద? అలాగయితే అడపాదడపా శలవుల కొచ్చినపుడు బాగానే వుంది. ఇలా లేదు పరాగ్గా వరే కాస్సేపు వూరుకుని అడుగుతే చెప్పకేం చేస్తుంది అనుకుంది.

సీత కూతురి గదిలోకి వెళ్ళేసరికి నిర్మల కిటికీ దగ్గర మోచెయ్యి మీద గడ్డం ఆన్చుకుని వంగి నించుంది. ఏదో ఆలోచిస్తున్నదల్లా తల్లిని చూసి తత్తరపడింది. సీత కూతుర్ని చూసీ చూడనట్టు వెళ్ళి మంచం మీద కూర్చుని అడిగింది

"ఏమే పరీక్ష బాగా రాసేవా?"

"ఊ"

"క్లాసు వస్తుందా?"

"రావచ్చు"

సీత ఇంక ఉగ్గపట్టలేకపోయింది గబగబా వెళ్ళి కూతురి మొహాన్ని తన వేపు తిప్పుకుని గదమాయించినట్టే అడిగింది. "ఏమిటే నిర్మలా ఆ పరాధానాలు? వచ్చిందగ్గర్నుంచీ చూస్తున్నాను హాస్టల్లో ఎవరితోనైనా విరోధపడ్డావా? కాలేజీలో, ఏమైనా గొడవలు జరిగేయా?"

చాలాసేపు గడిచేక నిర్మల నోరు విప్పింది, "పాపగారు ఎంత పని చేసేరో చూసేవమ్మా" అంటూ.

"పాపగారా!"

"ఆవిడే, మీ చిన్ననాటి స్నేహితురాలు. రెండేళ్ళ క్రితం మనం నిడదవోలు వెళ్ళినపుడు ఆహా! ఓహో! అంటూ, సరవాలేదు. మీ పిల్లని హాస్టల్లో వుంచడమెందుకు. మా ఇంట్లోనే వుండనీ మనమేం కొత్తవాళ్ళమా? అందా అప్పుడు నేనావిడ మాట కాదని హాస్టల్లో చేరడమే మంచిదయిందనుకో. ఏదో మీ ఫ్రెండే కదా అన్న చనువు కొద్దీ పది పన్నెండు సార్లు వాళ్ళింటికి వెళ్ళేను ఆవిడ బండారం కాస్తా బైట పడిపోయింది."

"ఏం. ఏమందేమిటి?" సీత కుతూహలంగా అడిగింది.

"మొదట్లో వెళ్ళిన ఒకటిరెండు సార్లూ ఆప్యాయంగానే ఆహ్వానించిందిలే. నా తిండీ, ఆరోగ్యం ఎలా వున్నాయో అడిగి తెలుసుకునేది. 'గ్రహచారం బావుండక మీ అమ్మా నేనూ కులం తప్పి పుట్టేముగాని లేకుంటే దాన్ని అడక్కుండానే నా ఇంట్లో విస్తరి వేసి వడ్డించేదాన్ని నీకు. నాకా మాత్రం హక్కులేదూ.' అనేది నవ్వుతూ 'పోనీ ఆ వూసు వదిలేయి. హాస్టల్లో పదిమంది మధ్యా గుద్దుకోవడమేం ఖర్మ. ఇంత ఇల్లుంది ఇక్కడుంటే నాకు తోడుగా కూడా వుంటావంటే నీకు పైత్యం చేసింది' అని విచారించేది మరోసారి వెళ్ళేసరికి ఇంత అభిమానమూ ఏమయిపోయిందో అనుమానంగా చూడ్డం ఆరంభించింది ఆవిడ ముద్దుల తనయుడున్నాడు చూశావ్, ఆ ఆనందబాబు నుంచే వచ్చిందీ గొడవంతానూ" అంది నిర్మల చివరి మాట చెబుతుంటే నిర్మల కళ్ళు నీటితో నిండిపోయాయి.

కూతురి కన్నీరు చూడగానే సీత గుండెలు టకటక కొట్టుకున్నాయి.

"ఆ అబ్బాయేం చేశాడే" అంది యధాలాపంగా

"ఏం చెయ్యక్కర్లేదు. పరాయి మగవాడు పక్కన నుంచుంటే చాలు, లోకం ఆడిపోసుకోవటానికి. చదువు సంగతెలా వున్నా ప్రతీ పార్కులోనూ, సినిమా హాల్సులోనూ మేమేనట. ఒకరోజు 'అమ్మాయీ జాగర్తగా చదువుతున్నావా?" అంది. మరో నాడు 'ఈమధ్య బొత్తిగా మా వాడిల్లు పట్టడంలేదు ఇద్దరూ ఒకటే క్లాసుట గదూ వాడిని కాస్త మందలించు' అంది చివరికోనాడు "ఏమిటమ్మాయీ నిన్న మీరిద్దరూ కాలేజీ నుంచటే ఎటో వెళ్ళేరుట మన పక్కింటి కమల మీ క్లాసమ్మాయే చెప్పిందిలే మీ అమ్మకి ఉత్తరం రాయమన్నావేమిటి?" అనేసింది. ఇంతకంటే వేరే తిట్టి, కొట్టి ఏడిపించక్కర్లేదమ్మా మనిషిని చాలు నేరకపోయి వెళ్ళేనా వూరు ఇక్కడ కాలేజీ లేనట్టు. బుద్ధి వచ్చిందిలే."

మాటలాపి తన వేపే నిలువు గుడ్లేసుకుని చూస్తున్న తల్లిని తెల్లబోయి, చూసింది నిర్మల.

"ఏమిటమ్మా అలా చూస్తున్నావు?" అంది.

"ఏంలేదు. సర్వసాధారణంగా మీ ఈడు పిల్లలికి బుద్ధి వచ్చినంత పని జరిగితేగాని బుద్ధిరాదులే. అందుకని చూస్తున్నాను. నువ్వామాట అన్నావంటే ఏదో అయిందనిపిస్తోంది నాకు"

తల్లి అలా అనగానే నిర్మల కళ్ళు ఎర్రబడిపోయేయి. సన్నగా రాగం ఆరంభించింది కూతురు తనకంటే పౌరుషం కలదని తెలిసినా సీత కూతుర్ని రెచ్చగొట్టకుండా ఉండలేకపోయింది ఈ దెబ్బతో నిర్మల మనసులోంచి ఆ నిజం ఏదో వూడిపడక తప్పదని సీత ధైర్యం ఇలాటి విషయాల్లో జాప్యం చేసిన కొద్దీ భయంకరమైన పరిణామాలు ఏర్పడతాయన్నది సీత సిద్ధాంతం. ఉత్తప్పుడు నిర్మల తనకి ముద్దు కూతురుగాని, ఒక నేరస్తురాలిగా తనకి తోచినపుడు కూతురు— కడుపున పుట్టిన బిడ్డ—ఈ బాంధవ్యాలు శిక్షార్హతకి అడ్డురాకూడదని ఆమె అనుకుంది అందుకే గొంతు పెద్దది చేసి అంది "నిప్పులేందే పొగ వస్తుందిటే, నిర్మలా నలుగురూ మిమ్మల్ని అనుకున్నారంటే, వుత్తినే ఆమాట పుట్టించడానికి వాళ్ళకే మవసరం? జాగర్తగా చూస్తుండమని నిన్ను నేను అప్పగించి వచ్చేను కాబట్టి, ఇద్దరి తరపునా పెద్దది అక్కడుంది కాబట్టి మందలించింది పిల్లలు కళ్ళుమూసుకు ప్రవర్తిస్తుంటే"

నిర్మల తల్లి మీద మండిపడింది. "మేమక్కడ కళ్ళు మూసుకు ఉన్నామో, ఎలా వున్నామో నువ్వు చూసేవా అమ్మా?" అనేసి ఒసారి ఆవురుమని కళ్ళు తుడిచేసుకుని ఎక్కిళ్ళు పడుతూనే సణిగింది. "ఆ పాపగారికి స్నేహితురాలిని అనిపించుకున్నావులే నన్ను చూస్తే మీ ఇద్దరికీ ఎలాగో వుంది ఆనందబాబు లాంటి వాడితో కలిసి కళ్ళు మూసుకు గోతిలో దిగిపోయేంత ప్రేమ వ్యవహారం నడిపేనన్న వాళ్ళ కసలు బుద్ధిలేదు డబ్బూ అందం వుంది గనక దర్జాగా కనిపిస్తాడు తెలివుందేమో చదువుకొంటున్నాడు ఒక సరసం తెలీదు విరసం చేతకాదు ఆ తల్లి నిలబడు అంటే నిలబడతాడు. కూర్చో అంటే కూర్చుంటాడు. అన్నీ తెలిసి మీరు నన్ను ఏడిపిస్తున్నారు....

సీత మనసులో నిశ్చయం చేసుకున్నంత గట్టిగా కూతుర్ని ఏడిపించ లేకపోయింది. "నేనన్నది అదికాదు నిర్మలా. ఇలా చూడు.

# నన్ను నమ్మవా?

వింతయినా అతను మగాడు. నువ్వు ఆడ పిల్లవి. మనసులు కలవడానికి కారణాలేమిటి? అనుభవపూర్వకంగా చెబుతున్నాను. ధన ఋణ ధృవాలు కలిస్తే విద్యుత్తు పుట్టక మానదు. అది మనల్ని కాల్చినంత దాకా పరిస్థితిని తెచ్చుకోకపోవడంలోనే ఉంది తెలివి '' అంది నెమ్మదిగా.

మర్నాడు నిర్మల ఎనిమిది గంటలయినా పక్కమీంచి లేవలేదు అప్పటికి నాలుగు సార్లు లేపి విసిగిపోయిన సీత డిస్పెన్సరీకి వెళ్ళడానికి టయిమవుతోందని త్వరత్వరగా తెమిలింది. వెళ్ళేముందు కూతురి గదిలోకి మరోసారి వెళ్ళింది

నిర్మల ఇంకా కళ్ళు విప్పలేదు. కను బొమలు ఉండి ఉండి ముడుచుకుంటు, న్నాయి. పెదాలు విచ్చుకొంటూ ముడుచు కొంటూ అస్పష్టంగా చలిస్తున్నాయి· దగ్గ రగా వొంగి చూసింది సీత గదిలోకి ప్రభా కర్ వచ్చేడు.

''ఏమిటలా చూస్తున్నావు? అమ్మాయికి వంట్లో బాగోలేదా?'' అన్నాడు. సీత అతడు అడిగిన దానికి జవాబు చెప్పకుండా ''నాలుగురోజులు మీరు ఒక్కరే డిస్పెన్సరీని చూసుకోలేరా?'' అంది.

''ఏం, ఎందుకూ?''

ప్రభాకర్ కంగారుగా అడిగేడు. తమ స్వంత డిస్పెన్సరీని సీత పక్కన లేకుండా ఒక్కరూ మానేజి చెయ్యలేనని అతని భయం. ప్రవాహంలా వచ్చిపడే ఆ పేషెం ట్లని తనకంటే సీతే వోపిగ్గా చూస్తుంది. పక్కన వుండి నామమాత్రంగా విధి నిర్వ ర్తించుకుని వచ్చేయడం ప్రభాకర్‌కి అల వాటు. అందుకే సీత వూరు వెళతానం టుందేమో అని ''ఈ లీవుకి కారణం చెప్పు'' అన్నాడు అతని దిగులేమిటో తెలుసుకున్న సీత నవ్వింది

''ఇదుగో, ఇదో పెద్ద ట్రబుల్ కేసయి పోయింది నాకు'' అంది నిర్మలని చూపించి. ''దీనికి క్యూర్ ఏమిటో తెలుసుకుందికి నిడదవోలు వెళ్ళిరావడం తప్పనిసరి నాకు''

భార్య మాటలు ప్రభాకర్‌కి బోధపడ లేదు. నిర్మల తనకి చెప్పినదంతా సీత భర్తకి విడమర్చి చెప్పి ''మన నిర్మల పౌరుషవంతు రాలు కాదని నేననటంలేదు గాని, ఈ గొడవ ఆ వూళ్ళో నలుగురి నోళ్ళలో పడకముందు, మనవల్ల పాపావాళ్ళూ ట్రబులయినట్ట యితే, ఇది కొంప మునిగే వ్యవహారం కానివ్వ కూడదని నా అభిప్రాయం అవసరమయితే పాపని బతిమాలి ఈ ఇద్దర్నీ శుభలేఖల్లో ఎక్కించేద్దాం. ఈ విషయంలో మా పెద్ద వాళ్ళు మీపెద్దవాళ్ళ ప్రమేయం అలావుంచి, వినండి. కారణంగానో, అకారణంగానో ఒక చెడు పేరు వస్తే వాళ్ళ కుటుంబాల్లో మగపిల్లాడికయినా ఆడపిల్లకయినా పిల్లల్ని వ్వటానికి వెనకాస్తారు. నా కూతురు వల్ల పాప కిలాంటి మాట రావటం నాకు చాలా బాధ అనిపిస్తుంది. వెళ్ళిరానా మరి?''

భార్య మనసుని తరచిచూడని అవివేకి కాడు ప్రభాకర్ అతడు తల వూపడం సీత రైలెక్కడం జరిగేయి సీతని చూస్తూనే ఎటోపోయిన ప్రాణం వచ్చినట్టు పిలస్ తుంది పాప ఎప్పుడూను. స్నేహితురాలి చేతులూ చెంపలూ తడిమింది ఆప్యాయంగా.

''ఏమిటి విశేషం? తగినంత కారణం లేకుండా ఈ గాలి ఇటు మళ్ళదు ఎప్పు డూను నన్ను చూద్దామనిపించే వచ్చేనా?''

''అబ్బబ్బా! కట్టుకున్న మొగుడి వల్ల కూడా నేనిన్ని దెప్పులు తినను సుమీ! ఏ జన్మ లోనో నీ చేత పుస్తెలు కట్టించుకునే వుంటాను రాక్షసుడి లాంటి మొగుడివి అప్పుడు''

ఇద్దరూ ఫకాలుమని నవ్వుకున్నారు. ''సరేగాని మీఅమ్మాయి తిన్నగా, చేరిందా?''

చేరిందన్నట్టు సీత తలూపి ''అంత ఘాటుగా మాట్లాడుతున్నావేమమ్మా'' అంది కూపీ లాగడానికి. అక్కణ్ణుంచీ తన కూతురి మీద నేరాలు చెప్తుకు వస్తుంది. పాప అనుకున్న సీత, పాపేమీ నోరెత్తక పోవడంతో ఆశ్చర్యపోయింది. ఉండపట్టక సీత అడిగేసింది.

''నిర్మలని నువ్వేదో అన్నావుట ఇంటి కొచ్చిందగ్గర్నుంచీ అది ఏడుస్తూనే వుంది. మా పాప నీ మనసు నొచ్చేనంత కానిమాట ఏమంటుందే అని నేను మందలించేను కూడా. చెప్పొద్దూ, ఈ పని మీదే నీ దగ్గరికి, వచ్చేను. ఇలాంటి విషయాల్లో...'' అం టుండగానే ''ఆ పోదూ. నీ కూతురిది మరీ బడాయి. అది ఏడవ్వలసంత నేనేమీ అనలేదే.'' అని వూరుకుంది పాప.

తరవాత సీత అక్కడున్న ఇరవైనాలు గ్గంటల్లోనూ ఆ ప్రసక్తే తీసుకురావడానికి వీల్లేకపోయింది. ఎప్పటికప్పుడే నేర్పుగా మాట మార్చేసేది పాప. మొత్తం మీద సీత తలలో లేచిన సందేహం సందేహంగానే వుండిపోయింది. పాప చాలా గడుసు మీరి పోయిందనుకుంది తను అనుకున్నంత హం గామా పాప చెయ్యనందుకు సీతకి ఓ వేపు సంతోషం కలిగింది. కూతురి అభిమానపు మనసుని అభినందించకుండా వుండలేక పోయింది మరో నాలుగ్గంటలికి కాకినాడ బయలుదేరుతుండుగా పాప ఇంటికి ఒక

(46 వ పేజీ చూడండి]



''బల్లో పీటులేదు పొమ్మన్నారు!— వాళ్ళకి తెలీకుండా పీట పట్టుకొచ్చేసా!!''

లావుపాటావిడ వచ్చింది. సెంటిమీటరు ఖాళీ లేకుండా నగలతో నిండిపోయుంది ఆవిడ మెడ. వేళ్ళతో లెక్కపెట్టగలిగినన్ని వెంట్రుకలు దిగలాగి చట్రం ముడి అమర్చుకుంది ఆవిడ. పాప చాప తెచ్చి వెయ్యగానే మోసుకొచ్చి పడేసిన బియ్యంబస్తాలాగ ధబుక్కున చతికిలబడింది. అక్కణ్ణుంచీ మొదలెట్టింది. లేచిందగ్గర్నుంచీ పడుకునే వరకూ ఇంట్లో ఉన్న ఎంతమంది పనివాళ్ళని అదుపాజ్ఞల్లో ఉంచలేక తన బాధపడాలో, తను ఇలా ఒక్కగంట బయల్దేరినా ఆ సమయంలో ఇల్లెంత గుల్ల అయిపోతుందో ఆ ఊర్లో తమకున్న పలుకుబడీ వరసగా ఆవిడ చెప్పేస్తుంటే వినలేక సీత చెవులు హోరెత్తిపోయాయి. పాప ఆవిడికి పని మనిషిచేత డ్రింకు తెప్పించి ఇచ్చింది. ఎండాకాలంలో ఆవిడ ఎక్కడికి బయల్దేరినా డ్రింకులుతప్ప మరోటి పుచుకోదుట. వక్కపొడి పొట్లం ఇస్తే నోట్లో వేసుకుంది ఆవిడ గుమ్మం దిగుతుండగానే సీత అంది "అమ్మయ్య! ఎవరుబాబూ ఈ సోదె మనిషి?"

పాప తన చేత్తో సీత నోరుమూసింది "వూరుకో! బాపుండ దావిడ వింటే" అంది. ఆవిడ మొగుడు ఆ ఊర్లో నాలుగు బియ్యం మిల్లులు నడుపుతున్నాడు. రాబడి ఇంతా అని అనుకోలేము ఆ సంగతలా వుంచితే, ఆవిడకి పాప కొడుక్కి ఈడయ్యే కూతురు

# నన్ను నమ్మవా?


ఒకర్తె వుంది పాలూ, పాదరసంతోతయారు చేసినట్టుంటుందా పిల్ల. ఈ పిల్లతల్లి మగపిల్లలకి ఆమధ్య వివాహాలు చేసినపుడు ఆ ఐశ్వర్యం ఆ హడావుడీచూసి పాపకి కళ్ళు తిరిగిపోయేయని చెప్పింది. అంతా చెప్పి 'ఇలాంటివాళ్ళతో వియ్యం పొందడం ఎంత అదృష్టం!' అంది.

వింటూనే సీతకి మొహం తిరిగినట్టయింది చిన్నప్పుడు ఎవరో అనుకోగా విన్న వో సంఘటన జ్ఞప్తికొచ్చింది. వాళ్ళూ తమలాగే ఇద్దరు స్నేహితులు. ప్రాణానికి మరో ప్రాణంలా ఉండేవాళ్ళు. తేడా ఒక్కటే వాళ్ళిద్దరిదీ ఒకటే కులం కావటాన ఆ స్నేహం మరింత సన్నిహితమయింది. నీకు కొడుకు పుడితే నా కూతురికి నీకుకూతురు పుడితే నా కొడుక్కి చేస్కుందామని పెళ్ళిళ్ళలోనే వాగ్దానాలు చేసుకున్నారు. వొట్లు వేసుకున్నారు. అలాగే పుట్టడం అయింది పుట్టిన పిల్లలు పెరగ కేమవుతారు? పెళ్ళీడుకి వచ్చేరు. కూతుర్నికన్న ఆవిడ ఆకొడుకుని కన్న ఆవిడ ఇంటికి వెళ్ళింది ఇహ నిశ్చయం తాంబూలా లిచ్చేసుకుందామని. స్నేహితురాళ్ళిద్దరినీ ఒకటేవూరు. ఎదురెదురిళ్ళు పిల్లలిద్దరిదీ ఒకటే స్కూలు. ఒకటే క్లాసు. పిల్లలిద్దరూ చిన్నప్పటినుంచీ ఒకేచోట పెరిగినవాళ్ళు కావటంచేత వాళ్ళ మనసుల్లో ఒకరిమీద మరొకరికి అభిమానాలు అనురాగాలు గాఢంగా ఏర్పడ్డాయి. వయసులు వచ్చేసరికి ఆ అనురాగానికి 'ప్రేమ అని పేరు మార్చుకున్నారు. పరిస్తితులు పరిసరాలు వాళ్ళ వూహాలికి, కోర్కెలకి దోహదం ఇచ్చినందువల్ల పెద్దవాళ్ళ ప్రమేయం తమకి అవసరమనిపించని ఒకానొక ఆవేశంలో క్షణికోద్రేకానికి దాసులయిపోయేరు. చేసిన తప్పు కాస్తా బయటపడింది. ఆడపిల్లగల ఆవిడ లబో దిబోమంటూ స్నేహితురాలి దగ్గరికివెళ్ళి తమ పిల్లల్ని స్వేచ్ఛగా వదిలినందుకు చెయ్యగలిగింది వాళ్ళ వివాహం గుట్టుగా జరిపించెయ్యడమే అని చెప్పింది. మగపిల్లవాడితల్లి అంతా విని వూరుకుంది. ఆవిడ వూరుకున్నా ఈవిడ వూరుకోలేక గట్టిగా నతాయిస్తే "మా వాడికి మరో అమ్మాయితో పెళ్ళి నిశ్చయం చేసేసుకున్నాం. అయినా కాకపోయినా మీ పిల్లని వూరిమీద ఎవరు వదిలేయమన్నారు? ఆడపిల్లని కన్నదానివి. అదుపులో ఉంచుకోవడం తెలీవద్దూ?" అని ఎగిరిపడిందావిడ. ఇంకా మాట్లాడితే "ఇదో గుణపాఠం అనుకుని వూరుకుని వుండు రభసచేస్తే నష్టం ఎవరికి? నీకే" అని దడిపించింది.

పాప ఆ ఇల్లాలికి ఏం తీసిపోతట్టే కనిపిస్తోంది. మీదు మిక్కిలి అటూ, ఇటూ పెద్ద రగడ కూడా జరుగుతుంది పాలలాటి తమ స్నేహంలో గరళం పోస్తున్నారీ పిల్లలు. వీళ్ళు పుట్టి చేసే ఉపకారం ఇది! అనుకుంది సీత. తలెత్తి పాపవేపు చూడాలంటే ఏదో వెరపు అడ్డువస్తోందిప్పుడు కళ్ళముందున్న సర్వమూ జుగుప్సామయంగా తోచేయి సీతకి. బొట్టుపెట్టి సాగనంపుతున్న పాపతో "వెళ్తాను" అని కూడా అనలేకపోయింది.

దారి పొడుగునా కూతురిమీద అంతులేని కోపం వచ్చింది ఇంటికి వెళ్ళగానే దాని పీక పిసిగేద్దునా? అనుకుంది కసితో. ఇంటికి వెళ్ళగానే ప్రభాకర్ అడిగాడు "ఏమిటి కథ? ఎంతవరకు వచ్చింది?"

మనసంతా చీకాగ్గావున్న సీత "ఇప్పుడు నన్నేమీ అడక్కండి" అంది వారం, పదిరోజులుగడిచినా సీత ఏంచెప్పకపోవటంవల్ల ప్రభాకర్‌కి భార్య తనని నిర్లక్ష్యం చేస్తోందనిపించింది. అనుమానం కూతురిమీదకి



పోయి కోపంతో నిగ్గదీశాడు. నిజంగానిదేనా తప్పు జరిగివుంటే తల్లీ కూతుళ్ళిద్దర్నీ పోయి ఎందులోనేనా పడమన్నాడు. అంతే గాని ఎడమొహం పెడమొహంతో, తననిలా ఇద్దరూ చేరి మాలిన బాధ పెట్టి చంప వద్దన్నాడు. ఆరోజే పాప దగ్గర్నుంచీఉత్తరం వచ్చింది.

"ప్రియ స్నేహితురాలు సీతకి, పాప వ్రాయునది.

మా అబ్బాయికి దైవానుగ్రహమువలన నే ననుకున్న ఆ లక్షాదికార్ల సంబంధమే కుదిరింది. కట్నం విషయం వ్రాయడం దోషం కనక వ్రాయడంలేదు. పాపకి ఉన్న ట్టుండి ఈ లక్షాధికార్ల స్నేహాలేమిటి? దాని మనసులో ఈ అంతులేని ఆశలేమిటి? ఎందుకిలా మారిపోయింది మా పాప? అని అనుకుంటావు. నీ దురభిప్రాయాలు వదలి గొట్టకపోతే మన స్నేహం చెడుతుంది. కనుకనే రాస్తున్నా. విను.

ఆరోజు మనింటికి వచ్చినావిడతో నాకున్న స్నేహం కొత్తగా తెచ్చిపెట్టుకున్నదికాదు. మేమిూ పూరు వచ్చిందగ్గర్నుంచీ వాళ్ళు మాకు తెలుసు ఆయన ఉద్యోగరీత్యానూ, నేను సంసార రీత్యానూ వాళ్ళవలన ఇప్పటికి అనేక ఉపకారాలు పొందేము. అవి ఫలానా అని విడమర్చి చెప్పుకోలేనివి. ఆర్థికంగా ఒక మెట్టు దిగువున వున్నవాళ్ళకి నిత్య జీవితా వసరాలు వెళ్ళాలంటే ఎన్ని తిప్పలు పడాలో నీకు నేను వేరే చెప్పక్కర్లేదు ఎందుకంటే మా కుటుంబాన్ని నీవు మొదటి నుంచీ ఎరుగుదువు కనుక.

ప్రతీ మనిషి ఏదో స్వలాభంకోరి వుండక పోతేగాని ఆవతలవాడికి ఉపకారం చెయ్యడు. ఇది మనిషి లక్షణం అయితే, ఆ స్వలాభం తెచ్చిపెట్టే ఇబ్బందులు ఘోరమైనవయితే ఇవతలవాళ్ళు చాలా బాధ పడాల్సివస్తుంది మా కాబోయే కోడలు పిల్ల అతి అందమైనది, చురుకైనది తెలివైనదేగాని భగవంతుడు ఆ అమ్మాయికి ఒక్కలోపం పెట్టేడు. ఆలోపం పెళ్ళిచూపులనాడు నేను ఆ పిల్లని నీ పేరేమిటమ్మా అని-అడిగితే నావేపు జాలిగా చూసి వినిపించదన్నప్పుడు తెలిసింది. అప్పటికే వాళ్ళు మాకు ఎంత దగ్గరికి వచ్చేశారో గ్రహించుకుని వొనిట్టూర్పు విడవటం మినహా ఏం చెయ్యలేకపోయేము మాలాంటి బీద కుటుంబాలకి దేవుడుపెట్టే అగ్నిపరీక్ష ఇది సీతా! ఇంత మహా వ్యాకులంలోనూ ఒక్క సంతోషకరమైన విషయం మేమిటంటే, మావాడు నాముందు ఆయనముందు వంచిన తల ఎత్తవల్సినవాడు కాకపోవటం! ఇంతవరకూ వచ్చేక ఇప్పుడు ఆ లక్షాధికార్లతో విరోధం ఎలా పెట్టుకుంటాము? కోడలికి వున్నది ఈమాత్రం లోపమేకదా—అనుకుని మేమూ వాడూ సరిపెట్టుకున్నాము.

త్వరలోనే శుభలేఖ వస్తుంది. పాపమీాద దురభిప్రాయాన్ని చెరిపేసుకుని పెళ్ళికి వస్తావుకదూ? పెడమొహం పెట్టుకుని నువు వెళ్తుంటే నాకు మనసు కష్టమనిపించింది. నీకోసం బహుశా నీ కూతుర్ని నేను సతాయించేనని అయివుంటుంది. నేను నీ కూతుర్ని ఏడ్వవలసినంత ఎక్కువగా నొప్పించలేదు. నిర్మల గురించీ నా కొడుకు గురించీ కాలేజిలో పుకారు పుట్టింది చెడుగా కనుక ఇద్దరూ కలిసి తిరగటం మంచిది కాదన్నాను. చెడ్డపేరు వచ్చినంత సులభంగా మాసిపోదు. మొక్కని పట్టిన చీడని మొదటిలోనే తుంపెయ్యకపోతే అది ఎదిగిఆకులో పువ్వులో కాయదు నిర్మల స్వతహా పౌరుషవంతురాలుఅని నాకు తెలుసు గనుక ఒక్క దులుపు దులిపే అది పౌరుషంపడి వూరుకుంటుందని—

ఇందువలన నాకు నిష్ఠూరంవచ్చినా నిర్మలకీ దానివలన నీకూ చెడ్డపేరురాదని అలా చేశాను. ఈ సంగతే నిర్మలకి చెప్పు. పెళ్ళికి దాన్నికూడా వెంటపెట్టుకురా. బావగారిని అడిగేనని చెప్పవలెను. ఉంటాను—

నీ పాప.

ఉత్తరం చదవడం పూర్తవగానే సీత మనసులో గాలీ వానా వెలిసినప్పటి ప్రశాంతత నిల్చింది. తల్లికి తెలీకుండా వెనకనుంచి వంగి చదివిన నిర్మల వెంటనే "ఇప్పుడైనా నన్ను నమ్ముతావా, నమ్మవా అమ్మా?" అంది. సీత నవ్వింది.

"ఎందుకు నమ్మనూ, ఇంకా? నువ్వు నా కూతురువని నాకు తెలియదా?" అంటూనే నిర్మలని దగ్గరికి లాక్కుని ఆపాయంగా బుగ్గలు నిమిరింది.

"అయితే పెళ్ళికి నావెంటవస్తావా?" అని సీత అడిగితే నిర్మల "ఊహు" అంటూ తల అడ్డంగాతిప్పి తల్లి చేతుల్లోంచి తప్పించుకుందికి ప్రయత్నించింది. నిర్మల కళ్ళలో చిప్పిల్లిన నీరు సీత చూడకపోలేదు. దానికి పెళ్ళికి వెళ్ళడం ఇష్టం ఉండదని తెలిసీ అలా అడిగినందుకు సీత లోలోపల నొచ్చుకుంది

వాళ్ళిద్దరి ఆ ఉత్తరం చదివాక కూడా ఎందుకలా ఉన్నారో అర్థంకాక ప్రభాకర్ తెల్లమొహం వేశాడు.

